సాక్షి నిజామాబాద్

మంగళవారం, 29, ఏప్రిల్, 2025



కమిటీ నిర్ణయమే కీలకం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపికలో కమిటీల నిర్ణయమే కీలకంగా మారింది.

- 8లో ▸



కాంగ్రెస్ ప్రభుత్వానికి..

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.9 /23.6

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సీపీని కలిసిన ఆదర్శ రైతు



సీపీకి పండ్లు అందిస్తున్న పాపారావు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రకృతి వ్యవసాయ చేస్తున్న ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామానికి చెందిన ఆదర్శ రైతు కరుటూరి పాపారావు పోలీస్ కమిషనర్ సాయి చైతన్యను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన వ్యవసాయం క్షేత్రంలో పండిన వివిధ రకాల పండ్లను సీపీకి అందించారు. ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన రైతు మహోత్సవంలో పాపారావు ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించిన సీపీ.. పాపారావు చేస్తున్న సుభాష్ పాలేకర్ వ్యవసాయ విధానంపై ఆసక్తి చూపారు. ఈ నేపథ్యంలో తాజాగా కలిసి పండ్లను అందించినట్లు పాపారావు తెలిపారు.

నేడు జిల్లా కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

నిజామాబాద్ సిటీ: డిచ్‌పల్లి మండలంలోని కేఎస్‌ఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి బోధన్, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, ఆర్మూర్, బాల్కొండ ఇన్‌చార్జీలు వినయ్ రెడ్డి, సునీల్ రెడ్డి, బాన్సువాడ బాధ్యులు రవీందర్ రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు.

లండన్‌లో తప్పిపోయిన జిల్లా విద్యార్థి



అనురాగ్‌రెడ్డి(ఫైల్)

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన విద్యార్థి నల్ల అనురాగ్ రెడ్డి ఈనెల 25న లండన్‌లో తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనురాగ్‌రెడ్డి ఉన్నత చదువుల కోసం ఏడాదిన్నర క్రితం స్టూడెంట్ వీసాపై లండన్ వెళ్లాడు. ఈనెల 25న సాయంత్రం స్నేహితులతో కలిసి కార్డిఫ్ ప్రాంతానికి వెళ్లాడు. కొంత సమయం తర్వాత స్నేహితులకు కనిపించలేదు. దీంతో వారు అతడి తల్లి హరితారెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అనురాగ్‌రెడ్డికి ఫోన్ చేస్తున్నా స్పందన లేకపోవడంతో ఆందోళన చెందిన తల్లి హరితారెడ్డి ఈ విషయాన్ని సోమవారం టీఎస్‌ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. తన కుమారుడిని వెతికించి, స్వదేశానికి రప్పించాలని కోరారు. ఈరవత్రి అనిల్ స్పందించి సీఎంవో కార్యాలయ అధికారులతో మాట్లాడారు. ఈ విషయమై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీలోని విదేశాంగ శాఖకు, లండన్‌లోని ఇండియా హైకమిషన్‌కు లేఖలు రాసినట్లు అనిల్ కుమార్ తెలిపారు.

విస్తరణ ఎన్నడో?



నిజామాబాద్ శ్రద్ధానంద్ గంజ్‌లోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ (ఫైల్)

ఇరుకిరుకుగా జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్

- రోజూ 12వేల క్వింటాళ్ల హోల్‌సేల్ వ్యాపారం
- మహారాష్ట్ర, ఏపీ సహా జిల్లాల నుంచి కూరగాయలు తీసుకొస్తున్న వ్యాపారులు
- వాహనాల రద్దీతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, వినియోగదారులు

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని కూరగాయల హోల్‌సేల్ మార్కెట్ విస్తరణ ఎప్పుడెప్పుడాని వ్యాపారులు, వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 12వేల క్వింటాళ్ల కూరగాయలు, ఆకుకూరల క్రయావిక్రయాలు మార్కెట్‌లో జరుగుతుంటాయి. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వ్యాపారులు, రైతులు కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. మార్కెట్ ఇరుకుగా మారడంతో వ్యాపారులతోపాటు కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

గాంధీగంజ్‌లో దశాబ్దాలపాటు కూరగాయల మార్కెట్ కొనసాగగా, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆధ్వర్యంలో శ్రద్ధానంద్ గంజ్‌లో 2017లో కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌ను 60 మడిగెలతో ప్రారంభించారు. ప్రస్తుతం మార్కెట్‌లో 95 మంది వరకు వ్యాపారులు లైసెన్సులను కలిగి ఉండగా, 60 మందికి మడిగెలు కేటాయించారు. రైతులు సైతం తాము సాగు చేసి తీసుకొచ్చిన కూరగాయలను అక్కడే విక్రయిస్తుంటారు. ప్రతిరోజూ ఉదయం 4 నుంచి 9 గంటల వరకు హోల్‌సేల్ మార్కెట్ కొనసాగుతోంది.

కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌లో ప్రతిరోజు సగటున 12వేల క్వింటాళ్ల కూరగాయలు, ఆకుకూరల క్రయవిక్రయాలు జరుగుతాయి. మార్కెట్‌కు జూలై నుంచి ఫిబ్రవరి వరకు సరుకు ఎక్కువ మొత్తంలో, మార్చి నుంచి జూన్ వరకు వేసవి దృష్ట్యా కూరగాయలు తక్కువగా వస్తాయి. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్, రంగారెడ్డితోపాటు జిల్లాలోని వివిధ మండలాల నుంచి రైతులు, వ్యాపారులు కూరగాయలు ఇక్కడ విక్రయించేందుకు తీసుకొస్తారు. ఇక్కడి నుంచి కామారెడ్డి, బాన్సువాడ, నిర్మల్, జగిత్యాల, ఆర్మూర్, ఎల్లారెడ్డి డివిజన్లతోపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న వివిధ మండలాలు, గ్రామాలకు రిటైల్ వ్యాపారులు కూరగాయలు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు.



నడవడమే కష్టం

హోల్‌సేల్ మార్కెట్ హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, వినియోగదారులతో ప్రతిరోజూ కిటకిటలాడుతుంది. తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 8 గంటల వరకు నడవడం కూడా కష్టంగా ఉంటుంది. ఇదే అదనుగా భావించి కొందరు దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. గతంలో దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటనలు కూడా ఉన్నాయి. మార్కెట్‌లో నడవడం కష్టం అనుకుంటే.. రిటైల్ వ్యాపారుల ఆటోలు, తోపుడు బండ్లు, వ్యాన్లు, మినీ డీసీఎంలతో మరింత ఇబ్బందికరంగా మారుతోంది. వినియోగదారులు, వ్యాపారులు పలుమార్లు ఈ విషయాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ప్రతిపాదనలు పంపించాం



నిజామాబాద్ కూరగాయల హోల్‌సేల్ మార్కెట్ విస్తరణకు ప్రతిపాదనలు పంపించాం. మార్కెట్ ఇరుకుగా మారడంతో నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయి. వినియోగదారులు, వ్యాపారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూ.కోటితో 40 మడిగెలు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాం. మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారుల పరిశీలన కూడా పూర్తయ్యింది. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– ముప్ప గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్, నిజామాబాద్

రికార్డులు తారుమారు చేస్తే పట్టాలు రద్దు



రెంజల్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- భూ భారతి చట్టంతో అధికారాలు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఎడపల్లి / రెంజల్ : మోసపూరితంగా హక్కుల రికార్డులను తారుమారు చేసి ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే వాటిని రద్దు చేసే అధికారం భూ భారతి చట్టం కల్పించిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. కొత్త చట్టంలో సాదాబైనామాలను క్రమబద్ధీకరించుకోవచ్చని తెలిపారు. ఎడపల్లి, రెంజల్ మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో సోమవారం నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. కొత్త చట్టం ద్వారా మ్యుటేషన్ అధికారాలను స్థానిక అధికారులకు కల్పించారని పేర్కొన్నారు. రైతుకు న్యాయం జరగని పక్షంలో అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, అవసరమైతే రైతులకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామన్నారు. భూభారతితో భూ వివాదాలకు చెల్లు చీటి పెట్టవచ్చన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 17 రాష్ట్రాల్లో అమలవుతున్న తీరును అధ్యయనం చేసి తర్వాతే ఆర్‌వోఆర్ చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. 2014 జూన్ 2 కంటే ముందు తెల్ల కాగితాలపై రాసుకొని భూములు కొనుగోలు చేసి క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ఆర్డీవో విచారణ చేపట్టి అన్నీ సవ్యంగా ఉంటే రిజిస్ట్రేషన్, స్టాంపు డ్యూటీ ఫీజులు తీసుకొని పట్టా జారీ చేస్తారని తెలిపారు. భూమి హక్కుల రికార్డులలో ఏవైనా లోటుపాట్లు, తప్పులుంటే సవరించుకునే వెసులుబాటును భూ భారతి కల్పిస్తోందన్నారు. రైతులకు ఏవైనా సమస్యలుంటే అధికారులు గ్రామాలకు వచ్చి అర్జీలు స్వీకరిస్తారన్నారు. సదస్సులో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్లు శ్రావణ్‌కుమార్, ధన్వాల్, ఇన్‌చార్జి ఎంపీడీవో రఫీయొద్దీన్, వ్యవసాయాధికారులు ప్రదీప్, శ్రీనివాస్‌రావ్, పీఏసీఎస్ చైర్మన్లు, రైతులు పాల్గొన్నారు.

పొట్టకూటి కోసం పగటి వేషం





పొట్టకూటి కోసం పగటివేషం వేసిన కళాకారులు సోమవారం నిజామాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ కనిపించారు. నలుగురు కళాకారులు వివిధ వేషధారణతో పాటలు పాడుతూ, డోలు, హార్మోనియం వాయిస్తూ వ్యాపార సముదాయాలు, దుకాణాల ఎదుట తమ కళను ప్రదర్శించారు. వ్యాపారులు ఇచ్చిన డబ్బును పోగు చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన తాము ఎన్నో ఏళ్ల క్రితం తెలంగాణలో స్థిరపడ్డామని, తమ పూర్వీకుల నుంచి వస్తున్న కళను ప్రదర్శిస్తూ పొట్టపోసుకుంటున్నామని వారు తెలిపారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్

గంజాయిపై ఉక్కుపాదం

- సీపీ సాయి చైతన్య

మోపాల్(నిజామాబాద్‌రూరల్): గంజాయి రవాణా, సాగుపై ఉక్కుపాదం మోపేందుకు జిల్లా వ్యాప్తంగా పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. మోపాల్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సాయంత్రం సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో కేసుల వివరాలను ఎస్సై యాదగిరి గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ మొత్తం కలియతిరిగి సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ మత్తుపదార్థాలకు బానిసలైన వారిని గుర్తించి కౌన్సెలింగ్ చేపట్టాలని సూచించారు. సైబర్ మోసాలు, గేమింగ్ యాప్‌లతో నష్టపోకుండా అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు మంచిప్ప కొండెం చెరువు, పెద్ద చెరువు వద్ద చేపడుతున్న ప్రాజెక్టును సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి పోలీసుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సౌత్ రూరల్ సీఐ సతీశ్‌కుమార్, ఎస్సై యాదగిరి గౌడ్, ఏఎస్సై రమేశ్ బాబు ఉన్నారు.



మోపాల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీ సాయి చైతన్య

కాంగ్రెస్ వాళ్లు కళ్లుండి చూడలేకపోతున్నారు

- సభ విజయవంతం చేసిన వారికి ధన్యవాదాలు
- ప్రకటనలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీఆర్‌ఎస్ సభకు అనుకున్నదానికన్నా ఎక్కువ మంది తరలివచ్చారని, సభ సక్సెస్ అయ్యిందని మీడియా మొత్తం చెబుతుండగా కాంగ్రెస్ వాళ్లు కళ్లుండి చూడలేకపోతున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. నిజామాబాద్, కామా రెడ్డి జిల్లాల నుంచి సుమారు 40వేలకు మందికిపైగా సభకు హాజరైనట్లు తెలిపారు. సభ విజయవంతానికి కృషి చేసిన రెండు జిల్లాల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. సభ సక్సెస్ కావడాన్ని కాంగ్రెస్ మంత్రులు, నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని, అడ్డగోలుగా వాగుతున్నారని విమర్శించారు. 17 నెలల పాలనలో కాంగ్రెస్‌పై, సీఎం రేవంత్‌రెడ్డిపై వచ్చిన వ్యతిరేకత సభకు వచ్చిన లక్షలాది ప్రజల్లో స్పష్టంగా కనిపించిందని పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పోలీసులను ఇతర యంత్రాంగాన్ని వాడుకుని సభ విజయవంతం కాకుండా కుట్రలు చేసినప్పటికీ ప్రజలు భారీగా తరలివచ్చారని, కాంగ్రెస్ కుట్ర కారణంగా సభకు చేరుకోలేకపోయిన వారు రోడ్లపైనే కిలోమీటర్ల కొద్దీ వేచి ఉన్నారని తెలిపారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రజల నుంచి తప్పించుకోలేదని, ఆ పార్టీ వైఫల్యాలను బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు గ్రామాల్లో ప్రజల పక్షాన ఎక్కడికక్కడ నిలదీస్తాయని స్పష్టం చేశారు.



ప్రశాంత్‌రెడ్డి

ఎండను లెక్కచేయకుండా..

నిజామాబాద్‌అర్బన్: మండుటెండను లెక్కచేయకుండా బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారని, అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా సభ సక్సెస్‌లో కీలక పాత్ర వహించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు అభినందనీయులని పేర్కొన్నారు.

సిద్ధులగుట్టపై చిరుత

- చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో సంచారం
- వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేసిన భక్తులు



ఆర్మూర్ : ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై సోమవారం చిరుత సంచరించింది. నవనాథ సిద్ధేశ్వరాలయంలో ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు చేసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. గుట్టపై ఉన్న చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో రాళ్ల మధ్య చిరుతను చూసిన కొందరు భక్తులు వీడియోతీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. వెంటనే పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఏడేళ్ల క్రితం ఇదే గుట్టపై చిరుత పులి కనిపించడంతో అటవీ శాఖ అధికారులు దానిని పట్టుకునేందుకు బోను ఏర్పాటు చేసినప్పటికీ చిక్కలేదు. తాజాగా మళ్లీ చిరుత కనిపించడంతో భక్తులు, పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిరుతను బంధించాలని కోరుతున్నారు.

ముగిసిన పశుగణన

- జిల్లాలో ఆరు నెలల పాటు కొనసాగిన సర్వే
- కేంద్ర ప్రభుత్వానికి చేరిన నివేదికలు
- త్వరలో వివరాలు వెల్లడించే అవకాశం



డొంకేశ్వర్(ఆర్మూర్): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 21వ అఖిల భారత పశు గణన జిల్లాలో ముగిసింది. పశువైద్య సిబ్బంది ఆరు నెలల పాటు శ్రమించి ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. 'పశుధన్' యాప్ ద్వారా మొత్తం పదహారు జంతు జాతుల వివరాలను సేకరించగా, నివేదికలు ఆన్‌లైన్‌లో కేంద్రానికి చేరాయి. ఏ జాతి పశువులు ఎన్ని ఉన్నాయ నే గణంకాలు చెప్పేందుకు సంబంధిత అధికారులు నిరాకరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వమే లెక్కలను త్వరలో విడుదల చేస్తుందని చెబుతున్నారు. నవంబర్‌లో మొదలైన పశు గణన కోసం పశుసంవర్ధక శాఖ 109మంది ఎన్యుమరేటర్లను, సర్వేను పర్యవేక్షించేందుకు 28మంది పర్యవేక్షకులను నియమించారు. సర్వే ప్రారంభమై మొదట్లో సిబ్బందికి ఇబ్బందులు ఎదురయ్యాయి. సాంకేతిక కారణాలతో యాప్ పని చేయలేదు. దీంతో ఫిబ్రవరిలోనే పూర్తి కావాల్సిన సర్వే ఏప్రిల్ వరకు సాగింది. మొత్తం 31 మండలాల్లోని 545 గ్రామ పంచాయతీలతోపాటు పట్టణాల్లో కూడా పశు గణన చేపట్టారు. సుమారు 4లక్షల నివాస గృహాలకు వెళ్లి ఆయా ఇళ్లల్లో పశు సంపద వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఐదేళ్ల క్రితం, ప్రస్తుతం చేపట్టిన సర్వే వివరాలను అనధికారికంగా చూస్తే చాలా వరకు పశు సంపద తగ్గినట్లు కనిపించిందని సర్వే చేసిన కొందరు సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రధానంగా గేదెలు, ఆవులు, ఎడ్లు, మేకలు, గొర్రెలు తగ్గే అవకాశం ఉందని, గేదెలు, ఆవులు తక్కువగా కనిపించాయంటున్నారు. నానాటికి పశు సంపద తగ్గిపోతున్న విషయాన్ని రైతులు సైతం అంగీకరించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కానీ కొన్ని చోట్ల గేదెల పెంపకం పెరిగిందని, వ్యవసాయ క్షేత్రాలు, ఇళ్ల వద్ద డైయిరీలను ఏర్పాటు చేసుకోవడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారని చెబుతున్నారు.

కేంద్రమే చెప్పాలి

జిల్లాలో పశు గణన సర్వే పూర్తయి దాదాపు వారం రోజులవుతోంది. జిల్లాలో ఏ పశువులు ఎన్ని ఉన్నాయో పశుసంవర్ధక శాఖ వద్ద లెక్కలు ఉన్నాయి. కానీ, నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వమే లెక్కలను ఆమోదించి బయటకు చెప్పాలి. దేశ వ్యాప్తంగా చేపట్టిన సర్వే కావడంతో ఒకేసారి పశు గణాంకాలు వెల్లడిస్తారు. 2018–19 గణంకాల ప్రకారం జిల్లాలో ఆవులు, ఎడ్లు కలిపి 1,0,1252, గేదెలు 2,06,898, గొర్రెలు 7,06,898, మేకలు 1,05,089 ఉన్నాయి. అయితే ఈ సంఖ్యలో భారీ హెచ్చుతగ్గులు ఉండొచ్చు.

ఒకేసారి వివరాలు వెల్లడవుతాయి

జిల్లాలో సర్వేను విజయవంతంగా పూర్తి చేశాం. కేంద్ర ప్రభుత్వం దేశమంతా ఒకేసారి పశుగణన వివరాలను వెల్లడిస్తుంది. విడుదల చేసిన వెంటనే జిల్లాలో ఏ పశువులు ఎన్ని ఉన్నాయనే లెక్కలు చెప్పేందుకు వీలుంటుంది. అప్పటి వరకు సర్వే వివరాలను బయటకు చెప్పలేము. బహుశా ఒకటి రెండు నెలల్లో లెక్కలు విడుదలయ్యే అవకాశం ఉంది.

– రోహిత్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీ

టమాట కిలో @ రూ.4

- భారీగా ధర పతనం
- 25 కిలోల టమాట బాక్సు రూ.100 నుంచి రూ.120
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు

బాల్కొండ: జిల్లాలో టమాట ధరలు భారీగా పతనమయ్యాయి. దీంతో సాగు చేసిన రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. వ్యాపారులు ప్రస్తుతం రైతుల వద్ద నుంచి కిలో టమాటకు రూ. 4 ల చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. 25 కిలోల టమాట బాక్సుకు రూ.100 నుంచి రూ.120 లు చెల్లిస్తున్నారు. దీంతో కనీసం కూలి దక్కడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాల్కొండ, ఆర్మూర్ ప్రాంతాల్లో పసుపు పంట తవ్విన నేలల్లో రైతులు ఎక్కువగా టమాటను సాగు చే శారు. ప్రస్తుతం పంట తొలి కాత చేతికొస్తుండగా.. ఆరంభంలోనే ధర పడిపోవడంతో రైతులు కుదేలవుతున్నారు. పంట దిగుబడి ఎక్కువైనా కొద్ది ధర మరింత పతనమయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు. గతంలో 25 కిలోల టమాట బాక్సు ధర రూ. 3 వేలు పలికింది. అలాంటి అదృష్టం వరిస్తుందని ఆశతో టమాట సాగు చేసిన రైతులకు నిరాశే మిగిలింది. కాగా, రైతుల వద్ద కిలో టమాటకు రూ.4 చెల్లించి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు హైదరాబాద్, మహారాష్ట్ర ప్రాంతాలకు తరలించి కిలోకు రూ.10ల చొప్పున విక్రయిస్తున్నారు. ధర పడిపోతుండడంతో టమాట కోసే బదులు దున్ని వేయడమే మేలుగా రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం టమాట రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



ముప్కాల్‌లో కోసిన టమాటను బాక్సుల్లో నింపుతున్న రైతు

రూ.100 కే బాక్సు కొంటున్నారు..

టమాటకు ధర దక్కడం లేదు. మార్కెట్‌లో ధర లేదని చెప్తూ వ్యాపారులు 25 కిలోల టమాట బాక్సును రూ. 100 కే కొంటున్నారు. కనీసం కూలి డబ్బులు కూడా రావడం లేదు. టమాటకు మంచి ధర దక్కుతుందని ఆశించాను. ధర కనీసం రూ. 500 ధర ఉండాలి. – మహేందర్‌రెడ్డి, రైతు, రెంజర్ల

క్లుప్తంగా

ధాన్యం తూకంలో జాగ్రత్తలు పాటించాలి



నిజాంసాగర్ (జుక్కల్): మండలంలోని గోర్గల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తూకం విషయంలో నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. తహసీల్దార్ భిక్షపతి, మండల వ్యవసాయ శాఖ అధికారి అమర్ ప్రసాద్, సొసైటీ సీఈవో సంగమేశ్వర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు రామా గౌడ్ తదితరులున్నారు.

తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

తన పంట పొలం చదును కోసం మట్టి తవ్వకాలు చేస్తే తహసీల్దార్ భిక్షపతి అడ్డుకుంటున్నాడని గోర్గల్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు మాగి గ్రామానికి చెందిన బాలయ్య ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ పట్టాభూమిలో నుంచి మట్టి తరలింపును అడ్డుకోవద్దని తహసీల్దార్‌కు సూచించారు.

పగలే వెలుగులు



బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్ గ్రామంలో అన్ని వీధుల్లో వీధిదీపాలతో పాటు చౌరస్తాలోని మహాత్మాగాంధీ విగ్రహం, అంబేడ్కర్ విగ్రహాల వద్ద పట్టపగలు విద్యుత్ బల్బులు వెలుగుతున్నాయి. విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని చెబుతున్న విద్యుత్ శాఖ అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కమిటీ నిర్ణయమే కీలకం

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యత అప్పగించిన సర్కారు
- త్వరలో అర్హుల జాబితా విడుదల చేయనున్న అధికారులు
- లబ్ధి పొందే వారిని తేల్చనున్న సభ్యులు



మోర్తాడ్(బాల్కొండ): పేద, మధ్య తరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపికపై ఇందిరమ్మ కమిటీల నిర్ణయమే కీలకంగా మారింది. ఆరు నెలల కిందట ఒక్కో గ్రామానికి ఐదుగురు సభ్యులతో కూడిన ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో నియోజకవర్గానికి 3,500 ల ఇళ్లకు సాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి కూడా ఇదే విధమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. గత ఆర్థిక సంవత్సర లక్ష్యంలో భాగంగా గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 31 గ్రామాలలో 2,761 ఇళ్ల నిర్మాణానికి అధికారులు సాంకేతిక అనుమతి ఇచ్చారు. అర్బన్ నియోజకవర్గం మినహాయించి బాల్కొండ, ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలలో లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. 15 వేలకు మించి లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యత ప్రభుత్వం కమిటీలపై వేసింది. ఇందిరమ్మ ఇళ్ల సాయం కోసం అనేక మంది దరఖాస్తు చేసుకోగా అధికారులు పరిశీలన జరిపి అర్హుల జాబితాను సిద్ధం చేశారు. ప్రతి గ్రామంలో వందలాది మంది అర్హులుండగా, పదుల సంఖ్యలోనే లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. దీంతో అధికారులు ఇచ్చిన జాబితా నుంచి కమిటీ సభ్యులు లబ్ధిదారులను ఎంపిక చేస్తే గృహ నిర్మాణ సంస్థ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు. ఇదిలా ఉండగా 600 ల చదరపు అడుగులకు మించకుండా, 400 ల చదరపు అడుగులకు తగ్గకుండా ఇంటిని నిర్మించుకుంటేనే సాయం అందిస్తామంటూ ప్రభుత్వం నిబంధన విధించింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అటు కమిటీ ఆశీస్సులతోపాటు ఇటు ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే మరి.

అర్హులను ఎంపిక చేస్తాం



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వంద శాతం అర్హులనే ఎంపిక చేస్తాం. గతంలో మాదిరిగా అనర్హుల ఎంపిక జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలు అర్థం చేసుకొని అర్హులైన వారికే సాయం అందించేలా సహకరించాలి. ఎలాంటి సిఫారసులకు అవకాశం లేదు.

– పుప్పాల అశోక్, ఇందిరమ్మ కమిటీ చైర్మన్, మోర్తాడ్

ఎవరికీ పైసా ఇవ్వొద్దు



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారులు ఎవరికీ నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. పేదలు, మధ్య తరగతి కుటుంబాలకే ప్రాధాన్యం ఇచ్చి అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలి.

– జక్కం అశోక్, కాంగ్రెస్ నాయకుడు, మోర్తాడ్

సైబర్ నేరాలపై అవగాహన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బస్టాండులో సోమవారం ఏఎస్సై ప్రకాశ్‌నాయక్ సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులకు బ్యాంకు ఖాతా నంబర్లు ఇవ్వద్దన్నారు. ప్రయాణం చేసే సమయంలో విలువైన వస్తువులు, డబ్బులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. సెల్ ఫోన్లు పోయినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.మత్తు పదార్థాలకు బానిసలు కావద్దన్నారు. వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించి, ధ్రువపత్రాలు వెంట పెట్టుకోవాలని సూచించారు. కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై ప్రకాశ్‌నాయక్

ప్రజావాణికి 114 ఫిర్యాదులు

నిజామాబాద్ అర్బన్: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 114 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అదనపు కలెక్టర్‌తోపాటు నిజామాబాద్ ఇన్‌చార్జి ఆర్డీవో స్రవంతి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్‌కు వినతిపత్రాలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ దిలీప్

కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలి



మల్కాపూర్ తండాలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



కొత్తపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నిజామాబాద్ రూరల్: రూరల్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలబడాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని చక్రధర్‌తండా, గాంధీనగర్‌తండా, మల్లారం, ధర్మారం, మల్కాపూర్ తండా సహా పలు గ్రామాల్లో సోమవారం ఆయన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మల్లారం తండాలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడు లేనంత అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్‌ను గద్దె దించేందుకు బీఆర్ఎస్, బీజేపీలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. కానీ మెజార్టీ స్థానాలు ఉన్న పార్టీని ఎలా గద్దె దించుతారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, పీసీసీ డెలికేట్ చంద్రశేఖర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య, బాగిర్తిబాగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కుల అందజేత



ఖలీల్‌వాడి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ ప్రతాప్ సింగ్ సతీమణికి సోమవారం రూ.16 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును సీపీ కార్యాలయంలో సీపీ సాయి చైతన్య అందజేశారు. నిజామాబాద్ అదనపు డీసీపీ (ఎఆర్)రామచంద్రరావు, ఏఓ అనిసాబేగం, ఆఫీస్ సూపరింటెండెంట్ వనజ, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షకీల్ పాషా తదితరులు ఉన్నారు.

బీర్కూర్‌లో యువకుడి ఆత్మహత్య

బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండల కేంద్రంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు లా.. మండల కేంద్రానికి చెందిన భూతిపిల్లి మహేష్(35) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి అతడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు బీర్కూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఈత చెట్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



ఈతవనంలో అంటుకున్న మంటలు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో రేణుకాదేవి ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఉన్న ఈత వనం సోమవారం దగ్ధమైంది. గౌడసంఘం ఆధ్వర్యంలో ఆరు ఎకరాల స్థలంలో ఈత చెట్లను పెంచుతున్నారు. సోమవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగి ఈత చెట్లు దగ్ధం అయ్యాయి. వెంటనే స్థానికులు ఫైర్‌ఇంజన్‌కు సమాచారం అందించగా, వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే రెండు వేల చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. చెట్ల దగ్ధం ఘటన మందుబాబుల పనే కావచ్చునని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

తగ్గెల్లి గ్రామంలో..



బోధన్: సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామ శివారులో గల కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం పరిధిలోని ఈత వనంలో సోమవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈత వనంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి చెట్లు కాలిబూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. నాలుగేళ్లుగా ఆరుగాలం కష్టపడి పెంచిన ఈత చెట్లు కాలిపోవడం వల్ల రూ.15 నుంచి 20 లక్షల వరకు నష్టం వాటిల్లిందని సంఘ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

దుకాణ యజమానులకు జైలుశిక్ష

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రంగర్‌గల్లికి చెందిన పవన్ చారీ తన బంగారు దుకాణాన్ని, శక్కర్‌నగర్ కాలనీకి చెందిన షేక్ యాకూబ్ తన మిల్క్ డైరీని, అలాగే ఓ బేకరీ యజమాని రాత్రి వేళలో సమయానికి మించి దుకాణాలను తెరిచి ఉంచినందున పోలీసులు వారిని అరెస్టు చేశారు. సోమవారం వారిని కోర్టులో హాజరు పర్చగా బేకరి యజమానికి రెండు రోజుల జైలు, మిగిలిన ఇద్దరికి ఒక రోజు జైలు శిక్షను జడ్జి విధించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వదల్‌పర్తి గ్రామ శివారులోని వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించేందుకు ప్రయతిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. లింగంపేట మండలం అయ్యపల్లికి చెందిన పోచబోయిన భాస్కర్, ఎక్కపల్లికి చెందిన ఎల్లమోల్ల సాయిలు వదల్‌పర్తి శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలించే ప్రయత్నం చేశారు. ఈ సమాచారం అందిన వెంటనే వారిని, ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు.

రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల గ్రామ శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నిజాయితీ చాటిన హోటల్ యజమాని



నిజాంసాగర్(జుక్కల్): ఓ మహిళ హోటల్‌లో మర్చిపోయిన బంగారు అభరణాలను హోటల్ యజమాని బాధిత మహిళకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు ఇలా.. తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామానికి చెందిన సైదగారి బాలమణి ఆదివారం మధ్యాహ్నం నిజాంసాగర్ బస్టాండ్‌లో బస్సుదిగింది. అనంతరం సమీపంలోని హోటల్‌లో టిఫిన్ తినడానికి వెళ్లింది. అదే సమయంలో బంగారు చెవి కమ్మలను హోటల్‌లో మర్చిపోయి వెళ్లిపోయింది. కొద్దిసేపటికి కమ్మలు కనిపించకపోవడంతో బంధువులకు తెలపగా, వారు హోటల్ యజమానికి ఫోన్‌లో సంప్రదించారు. యజమాని కమ్మలను భద్రంగా ఉంచాడు. బాధితురాలిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి చెవి కమ్మలను అందజేశాడు.

పేకాడుతున్న పలువురి అరెస్టు

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని దేవివిహార్ ఫేస్–3 కాలనీలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం రావడంతో దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది దాడులు జరిపారు. పేకాట ఆడుతున్న 9మందిని అరెస్టు చేశారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 60,400 నగదుతో పాటు రెండు బైకులు, తొమ్మిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బోధన్ మండలంలో..

బోధన్ రూరల్: మండలంలోని కలదుర్కి గ్రామంలో పేకాట స్థావరంపై దాడిచేసి పేకాడుతున్న 10మందిని అరెస్ట్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై సందీప్ సోమవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,600 నగదు, 8సెల్ ఫోన్లు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌టౌన్: పట్టణ శివారులోని డంపింగ్ యార్డ్ వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సోమవారం పట్టణ సీఐ వెంకట నారాయణ, ఎస్సై హబీబ్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1950 నగదు, 4 ఫోన్లు, ఒక బైక్, ఒక కార్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్‌ను రెండు రోజుల కిందట గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి, కాపర్ వైరును చోరీ చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం రాత్రి స్థానిక రైతులు గుర్తించారు. సోమవారం ఉదయం ఎత్తిపోతల చైర్మన్ గయాస్‌కు తెలుపగా ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఏడుగురి మృతి



నవీన్ (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలోని ఊర చెరువులో ఓ వ్యక్తి పడిపోయి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన పుట్ట నవీన్(41) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం ఊర చెరువులో అతడి మృతదేహం తేలింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హైదరాబాద్‌లో చిట్యాల మాజీ సర్పంచ్..



శారద (ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అంబీర్ శారద(50) హైద్రాబాద్‌లో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. హైదరాబాద్‌లో శారద భర్త మధుసుదన్‌రావుతో కలిసి బైక్‌పై వెళుతుండగా వెనుక నుంచి లారీ వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో శారద అక్కడికక్కడే మృతిచెందగా, మదుసుధన్ రావుకు తీవ్రగాయాలు అయ్యాయన్నారు. శారద 1993–98 వరకు చిట్యాల సర్పంచ్‌గా పనిచేసిందన్నారు. మధుసుదన్‌రావు గతంలో తాడ్వాయి ఎంపీపీగా పనిచేశాడన్నారు. శారద మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఆమె స్వగ్రామమైన చిట్యాలలో సోమవారం అంత్యక్రియలను జరిపించారు.

బావిలో పడి ఒకరు..

ఎడపల్లి(బోధన్): మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన దేవదాస్ (28) ఆదివారం స్నేహితులతో కలిసి గ్రామశివారులోని పంటపొలాల్లో మద్యం సేవించడానికి వెళ్లారు. కొద్దిసేపటికి దేవదాస్ పక్కనే ఉన్న బావి వద్దకు మూత్ర విసర్జనకు వెళ్లగా ప్రమాదవశాత్తు బావిలో పడి ఈత రాక చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం ఉదయం మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు

అశోక్ సాగర్‌లో పడి వృద్ధురాలు..

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట గ్రామ శివారులోగల అశోక్‌సాగర్‌లో ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు పడి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామనికి చెందిన బోదాసు దేవమ్మ (60) ఆదివారం సాయంత్రం గ్రామ శివారు కాలకృత్యాలకని వెళ్లి, ప్రమాదవశాత్తు అశోక్ సాగర్‌లో పడి మృతి చెందింది. మృతదేహాన్ని సోమవారం ఎడపల్లి పోలీసులు బయటకు తీసి, బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా.. పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామానికి చెందిన బొట్ల సంజీవ్ (35) కామారెడ్డి గాంధీ గంజ్‌లో డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 27న సాయంత్రం అతడు బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఉగ్రవాయి వద్ద అతడి బైక్‌ను కామారెడ్డి వైపు వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో సంజీవ్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపారు.

నగరంలో గుర్తుతెలియని వ్యక్తి..



ఖలీల్‌వాడి: నగరంలోని తిలక్ గార్డెన్ కాంప్లెక్స్ సమీపంలోగల గ్లామర్ హోటల్ ఎదుట గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. హోటల్ ఎదుట అతడు అపస్మారక స్థితిలో ఉండగా అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అతడిని వైద్యులు పరిశీలించగా మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, సుమారు 40నుంచి 45 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. మృతుడు బ్లూ కలర్ షర్టు, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించినట్లు తెలిపారు. ఎవరికైనా తెలిసినచో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో లేదా 87126 59714ను సంప్రదించాలని తెలిపారు.

జానకంపేటలో..



ఎడపల్లి: మండలంలోని జానకంపేట శివారులోగల అశోక్ సాగర్ తూము వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలింది. జానకంపేట గ్రామానికి చెందిన జీపీ కార్మికుడు గుంజ శ్రీనివాస్ మృతదేహాన్ని గమనించి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 45నుంచి 50ఏళ్ల లోపు ఉంటుందన్నారు. అతడి వద్ద ఆధారాలు ఏవీ లభించలేవన్నారు. నీలం కలర్ లుంగీ, తెలుపు బనియన్ ధరించి ఉన్నాడని, ఎవరైనా గుర్తిస్తే 87126 59873 లేదా 87126 59780ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

భర్తను హత్య చేసేందుకు భార్య కుట్ర

- ప్రియుడితో కలిసి ఐదుగురికి రూ.15లక్షల సుపారీ
- మొత్తం ఐదుగురు అరెస్టు, పరారీలో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్‌చంద్ర



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని భర్తను హత్య చేయించేందుకు చేసిన కుట్ర ఫెయిల్ అవ్వడంతో నిందితులు కటకటాల పాలయిన ఘటన మాచారెడ్డి మండలంలో వెలుగుచూసింది. ఈ కేసులో మొత్తం ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర వివరాలు వెల్లడించారు. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్(ఎం) గ్రామానికి చెందిన సాడెం కుమార్ మెదక్ జిల్లాలోని ఓ మున్సిపాలిటిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అల్వాల్‌కు చెందిన కాంపల్లి మహేష్ ప్రస్తుతం రాజన్న సిరిసిల్లా జిల్లా తంగళ్లపల్లి వద్ద ఉన్న లలితమ్మ గుడిలో పూజారిగా పనిచేస్తున్నాడు. కుమార్ భార్య రేణుక నాలుగేళ్లుగా మహేష్‌తో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తుంది. ఈక్రమంలో తమ వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్న కుమార్‌ను హతమార్చాలని రేణుక, మహేష్‌లు కుట్ర పన్నారు. ఆ తర్వాత అతని ఉద్యోగాన్ని, ఆస్తిని దక్కించుకోవాలని భావించారు. అల్వాల్‌కు చెందిన మహమ్మద్ అశ్వాక్‌తో రూ.15 లక్షలకు సుపారీ మాట్లాడుకున్నారు. అశ్వాక్, అతని అనుచరులు ముబిన్, అమీర్, అన్వర్, మోసిన్‌లకు అడ్వాన్సుగా రూ.2లక్షలు ఇచ్చారు. ఈ నెల 21న కుమార్ బైక్‌పై వెళ్తుండగా ఫరీద్‌పేట సమీపంలోని సోలార్ ప్లాంట్ వద్ద దారి కాచిన సుపారీ గ్యాంగ్ అతడిని అడ్డుకుని రాడ్లతో దాడి చేశారు. అదే సమయంలో అటుగా కారులో ఓ ఇద్దరు వ్యక్తులు రావడం చూసి అక్కడి నుంచి నిందితులు పరారయ్యారు. వెంటనే కుమార్‌ను స్థానికులు, పోలీసులు కలిసి ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసిన మాచారెడ్డి పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. వారిని పట్టుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. ప్రధాన నిందితులైన మహేష్, రేణుకలతో పాటు సుపారీ గ్యాంగ్‌కు చెందిన అశ్వాక్, ముబీన్, అమీర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. పరారీలో ఉన్న ఇద్దరి నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు. నిందితుల వద్ద నుంచి ఓ కారు, ఆటో, రెండు బైక్‌లు, గొడ్డలి, రాడ్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన రూరల్ సీఐ రామన్, ఎస్ఐ అనిల్, సిబ్బందిని అభినందించారు.

మామను చంపిన అల్లుడు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్

నవీపేట: మండలంలోని అనంతగిరి గ్రామంలో మామ అల్లుళ్ల మధ్య జరిగిన ఘర్షణలో మామ హతమయ్యాడు. నిజామాబాద్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్‌లు సోమవారం వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కచర్‌దాం జిల్లా చిర్పాలి గ్రామానికి చెందిన బిలంసింగ్ మరవి(48) కూతురు గోమతి దుర్వే, అల్లుడు రాజేష్ దుర్వేలతో కలిసి మండలంలోని గోదాం నిర్మాణంలో కూలీలుగా పని చేస్తున్నారు. రాజేష్ దుర్వే తరచూ భార్యను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. ఈవిషయమై ఆదివారం రాత్రి మద్యం సేవించాక మామ, అల్లుడు గొడవపడ్డారు. ఆగ్రహానికి లోనైన అల్లుడు ఇటుకను తీసుకొని మామ తలపై విచక్షణరహితంగా బాదాడు. దీంతో మామ బిలం సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నవీపేట: నవీపేట శివారులోని బట్టుబాగ్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. యంచ గ్రామానికి చెందిన హరికృష్ణ, చందు బైక్‌పై జన్నెపల్లికి వెళ్తుండగా వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈఘటనలో బైక్ పైన ఉన్న ఇద్దరికి స్వల్ప గాయలైనట్లు తెలిపారు.